NE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 197
ఆదివారం 26 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

ఇరాన్‌పై గల్ఫ్ దేశాల సీక్రెట్ ఆపరేషన్..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 25)
పశ్చిమాసియాలో యుద్ధం మొదలైందేమో.. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య. కానీ విలవిల్లాడుతున్నాయేమో గల్ఫ్ దేశాలు. అమెరికా దాడులకు ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని యూఎస్ స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోన్న సంగతి తెలిసిందే. అమెరికా బేస్‌లనే టార్గెట్ చేస్తున్నామని చెప్తున్నప్పటికీ.. సౌదీ, యూఏఈ వంటి దేశాలకు అంతర్జాతీయంగా ▶2లో

ఇరాన్ సీరియస్‌గా ఆలోచిస్తోంది
పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ట్రంప్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 25)



అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో కొత్త ప్రకటన చేస్తున్నారు. చర్చల అంశాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తోందని తాజాగా పేర్కొన్నారు. అందుకే ఆ దేశంపై భీకర దాడులు చేయాలా.. వద్దా.. అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. భీకర దాడుల అంశంపై ఉన్నతస్థాయి అధికారులతో ▶2లో



ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యం
బండి సంజయ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. " ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఎల్-నినో కారణంగా తీవ్ర నీటి కొరత.. మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ఆదేశాలు


గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ అధికారులతో నిమ్మల ఉన్నత స్థాయి సమీక్ష
మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యతనివ్వాలని సూచన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
పులిచింతల, పట్టిసీమ నీళ్లను తాగునీటి అవసరాలకు భద్రపరుచుకోవాలన్న మంత్రి
రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిపూర్ణ సమన్వయంతో పనిచేయాలని ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ సీఈలు, ఎస్ఈలతో ఈరోజు నిర్వహించిన ఉన్నత స్థాయి టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ▶2లో

పొగాకు సంక్షోభంపై
కేంద్రం దృష్టి..

శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు పట్టు
పొగాకు రైతుల సమస్యలపై రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం
తాత్కాలిక ఉపశమనం కాదు, శాశ్వత పరిష్కారం కావాలన్న సీఎం
రైతులను ఆదుకునేందుకు కేంద్ర బృందం మూడు ప్రతిపాదనలు
బయ్యర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు.. సోమవారం మరోసారి సమావేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన నిరంతర సంప్రదింపుల ఫలితంగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి బృందాన్ని రాష్ట్రానికి పంపింది. శనివారం కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ భేటీ అయ్యారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టొబాకో బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు రూపొందించిన మూడు కీలక ప్రతిపాదనలపై కేంద్ర ▶2లో



భవిష్యత్తులో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
విదేశాల్లోని మైనింగ్ వేలంలో పాల్గొనే అవకాశాల్ని పరిశీలించాలి
'రాబోయే 15-20 ఏళ్లలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా.. థర్మల్ పవర్, సోలార్, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, గ్రీన్ ఎనర్జీ రంగాలకూ విస్తరించాలి. సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, చిప్‌ల తయారీకి అత్యంత కీలకమైన లిథియం, కోబాల్ట్, రేర్‌ఎర్త్ వంటి క్రిటికల్ మినరల్స్ అన్వేషణలోకి ప్రవేశించాలి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా దేశాల్లో క్రిటికల్ మినరల్స్ బ్లాకుల వేలంలో పాల్గొనే అవకాశాలను పరిశీలించాలి' అని సింగరేణి సంస్థకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. భద్రాద్రి కొత్తగూడెంలోని ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంస్థ ఆర్థిక పరిస్థితి, కొత్త గనుల అభివృద్ధి, దీర్ఘకాలిక లక్ష్యాలను వివరించారు. సమీక్ష అనంతరం మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం టౌన్‌షిప్‌లోని డీఏవీ పాఠశాలను భట్టి ప్రారంభించారు. విద్యుదుత్పత్తి కేంద్రంతోపాటు ప్రకాశ్‌ఖనిని పరిశీలించారు. ▶2లో

అనిత 'ఎక్స్' అకౌంట్ హ్యాక్.. పోలీసులకు ఫిర్యాదు

అనిత ఎక్స్ ఖాతాలోకి చొరబడిన హ్యాకర్లు
ఒక స్కామ్ లింక్‌ను ప్రొఫైల్‌లో పిన్ చేసిన వైనం
రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
ఏపీ హోంశాఖ మంత్రి అనిత అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా సైబర్ నేరగాళ్ల బారిన పడింది. హ్యాకర్లు ఆమె ఖాతాను స్వాధీనం చేసుకుని... ప్రొఫైల్ డీపీ, పాత పోస్టులను కనిపించకుండా చేసి క్రిప్టోకరెన్సీకి సంబంధించిన ఒక స్కామ్ లింక్‌ను ప్రొఫైల్‌లో పిన్ చేశారు. ఫైర్‌లైట్ ప్రోటోకాల్ సంస్థకు చెందిన రివార్డ్స్ పేరుతో ఉన్న ఈ అనుమానాస్పద పోస్ట్ ప్రత్యక్షమవ్వడంతో హ్యాకింగ్ వ్యవహారం ▶2లో

కేంద్రంతో సీజేపీ ప్రతినిధుల చర్చలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి పరిష్కార మార్గం కనుక్కొనేందుకు గాను కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు, కేంద్రం మూడోసారి చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చల్లో కేంద్రం తరఫున మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లు పాల్గొనగా.. సీజేపీ తరఫున సౌరవ్ దాస్, అశుతోష్‌లు పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన నేపథ్యంలో ఈ చర్చలకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
మరోవైపు, విద్యార్థులు సీజేపీ నిరసనకారుల ప్రధాన డిమాండ్ నెరవేరడంతో ▶2లో

అగ్రరాజ్యంలో నీటి గండం.. ఎండిపోతున్న అమెరికా నగరం

అమెరికాలోని కార్పస్ క్రిస్టీ నగరంలో తీవ్ర నీటి సంక్షోభం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
అగ్రరాజ్యం అమెరికాలో ఊహించని సంక్షోభం ముంచుకొస్తోంది. టెక్సాస్ రాష్ట్రంలోని కార్పస్ క్రిస్టీ అనే నగరం తీవ్రమైన నీటి కొరతతో అల్లాడుతోంది. సుమారు 3 లక్షల మందికి పైగా జనాభా ఉన్న ఈ తీర ప్రాంత నగరం, ఆధునిక అమెరికా చరిత్రలో నీళ్లు పూర్తిగా అడుగంటిన తొలి నగరంగా నిలిచే ▶2లో

బ్యారేజీల నిర్వహణపై కేంద్రానికి లేఖ

జలశక్తి మంత్రిత్వశాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి స్పష్టత కోరాలి
సాంకేతిక నివేదికల ఆధారంగా తుది నిర్ణయం: మంత్రి ఉత్తమ్

ల(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)



కాళేశ్వరం ఎత్తిపోతలలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించినట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. 'ఎన్‌డీఎస్‌ఏ(నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) సూచించిన విధంగానే మూడు బ్యారేజీలను ఫ్రీ-ఫ్లో(నీటి నిల్వ లేకుండా) స్థితిలో గేట్లు తెరిచి ఉంచాం. రాజకీయ ఒత్తిళ్లు లేదా భౌతిక పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల నుంచి లిఖిత పూర్వక సిఫార్సులు తీసుకుని నీటినిల్వ, పంపింగ్‌పై నిర్ణయం తీసుకుంటాం. జలశక్తి మంత్రిత్వశాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్‌ఏ సిఫార్సులతో పాటు అన్ని ఆధారాలు పంపాలి. ఎందుకు నీటినిల్వకు, పంపింగ్‌కు బ్యారేజీలు వినియోగించడం లేదన్నది వివరించి సాంకేతికసంస్థల అభిప్రాయం కూడా కోరాలి. ప్రభుత్వ నిర్ణయం అధికారిక రికార్డులో ఉండాలి. ఈ లేఖను రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా జలశక్తి శాఖకు స్వయంగా అందజేసే చర్యలు చేపట్టాలి' అని పేర్కొన్నారు. ▶2లో




నీట్ నినాదాల మధ్య 'వందేమాతరం' బిల్లు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)
నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండుపై ఇటు విపక్షాలు, అటు ప్రభుత్వం పట్టు వీడకపోవడంతో పార్లమెంటు ఉభయ సభలు అయిదోరోజు కూడా వాయిదా పడ్డాయి. వర్షాకాల సమావేశాల మొదటివారం వరుసగా నిరసనలతోనే గడిచిపోయింది. సోమవారం సభలు పునఃప్రారంభమవుతాయి. రాజ్యసభలో ప్రతిపక్ష ▶2లో

మీ ప్రేమ ఇలాగే కొనసాగాలి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 25)
ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ గురువారం తాను విడుదల చేసిన వీడియోకు విద్యార్థుల నుంచి భారీ స్పందన రావడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. వారికి ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం రాత్రి మరో వీడియోను విడుదల చేశారు. "నేను పోస్ట్ చేసిన వీడియోకు మీరు విస్తృతంగా స్పందించి సానుకూల సూచనలు చేశారు. మీ అందరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ ఇలాగే కొనసాగాలి. మన బంధం మరింత బలోపేతమవ్వాలి. ధన్యవాదాలు" అని అందులో పేర్కొన్నారు. అంతకుముందు, మంత్రులందరూ సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలకంగా ఉండాలని, యువతతో మమేకమవుతూ ముందుకు సాగాలని క్యాబినెట్ భేటీలో ప్రధాని సూచించారు.



మొదటిపేజీ తరువాయి

పాగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి..

బృందం సీఎంతో చర్చించింది. వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి అంశాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఏటా ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు.

"తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలతో ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అందరి సమష్టి బాధ్యతతోనే ఇది సాధ్యం" అని ఆయన అభిప్రాయపడ్డారు. పంటను నిల్వ ఉంచుకుని ధరలు స్థిరపడ్డాక అమ్ముకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చర్చలను ముందుకు తీసుకెళ్లి, పరిష్కారం కనుగొనాలని కేంద్ర మంత్రి పెమ్మసానికి సూచించారు.సీఎం సూచనల మేరకు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలిసి పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, బయ్యర్లు కూడా సహకరించాలని కోరారు. తదుపరి చర్చల కోసం సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని రైతుల కష్టాలను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

ఇరాన్‌పై గల్ఫ్ దేశాల సీక్రెట్ ఆపరేషన్..?

ఉన్న పేరు దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో బహ్రెయిన్, కువైట్ యుద్ధ విమానాలతో ఇరాన్‌పై తొలిసారి ప్రత్యక్ష దాడి చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది.గల్ఫ్ దేశాలు తమ సైనిక అవసరాల కోసం ప్రధానంగా అమెరికా మీద ఆధారపడతాయి. బహ్రెయిన్, కువైట్ వైమానిక దళం పరిమాణం పరంగా చాలా చిన్నదే. అందులో ఉండే యుద్ధ విమానాలు అమెరికా, ఐరోపా దేశాలకు చెందినవి. అలాంటి ఈ రెండు దేశాలు ఇరాన్ నుంచి తరచుగా ఎదురవుతోన్న దాడులకు స్పందించాలని నిర్ణయించుకున్నాయి. అందుకు యూఏఈ సహకరించింది. ఇరాన్‌లోని లక్ష్యాలకు సంబంధించిన నిఘా సమాచారం ఇచ్చింది. ఈ క్రమంలోనే జులై ప్రారంభంలో ఇరాన్‌లోని డ్రోన్, క్షిపణి నిల్వలపై బహ్రెయిన్, కువైట్ యుద్ధ విమానాలతో దాడి చేసినట్లు ఆ మీడియా కథనం పేర్కొంది. ఆరంభంలో సౌదీ అరేబియా కూడా యూఈఏతో చేతులు కలిపింది కానీ.. తర్వాత తన వైఖరిపై పునరాలోచన చేసిందని పేర్కొంది. రహస్యంగా జరిగిన ఈ ఆపరేషన్ యుద్ధం విస్తరణకు ఓ సూచన అంటూ ఆందోళన వ్యక్తమవుతోంది.రెండువారాల క్రితం హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేయడంతో పశ్చిమాసియా మళ్లీ దద్దరిల్లుతోంది. ఈ క్రమంలోనే ఇరాన్ నుంచి బహ్రెయిన్, కువైట్ దాడులను ఎదుర్కొంటున్నాయి. యూఎస్ బేస్‌ల లక్ష్యంగా ఈ రెండు దేశాలతో పాటు జోర్డాన్‌పై ఇరాన్ దాడులు చేసింది.

సౌదీ-యెమెన్ ఘర్షణలు..

అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియా పరిస్థితులు దిగజారుతుంటే.. సౌదీ అరేబియా-హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులు ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇరాన్ మద్దతు గల హూతీలు ఎర్రసముద్రంలో దిగ్బంధనాన్ని ప్రకటించి.. సౌదీ నౌకలపై దాడులు చేశాయి (ఫొటోఎఐ-హూతీఎఐ-ఎక్స్‌క్లూజివ్). దాంతో సౌదీ అరేబియా యెమెన్‌లోని హూతీ నియంత్రణలో ఉన్న ప్రాంతాలపై తాజాగా వైమానిక దాడులు చేసింది.

ఇరాన్ సీరియస్‌గా ఆలోచిస్తోంది
పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ట్రంప్

ట్రంప్ చర్చలు జరుపుతున్నారని వార్తలు వస్తోన్న నేపథ్యంలో ఈ స్పందన వచ్చింది."ప్రస్తుతం మేం వారితో చర్చలు జరుపుతున్నాం. చర్చలను వారు సీరియస్‌గా తీసుకుంటున్నారు. అందుకు కారణం ఉండొచ్చు. వారు లొంగిపోవచ్చు.. లేదా ఏదైనా గుహలోకి వెళ్లి దాక్కోవచ్చు. మా వైపు నుంచి క్షిపణులు లోడ్ చేసే ఉన్నాయి. యుద్ధం ముగించడానికి రెండు అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు చేస్తోన్న దాడుల తీవ్రత పెంచి, వాళ్ల దగ్గర ఉన్నదంతా నాశనం చేయొచ్చు. లేకపోతే ఒప్పందం చేసుకోవచ్చు. డీల్ చేసుకోవడమనేది తెలివైన వ్యూహం. చర్చల విషయంలో వారు సీరియస్‌గా ఉన్నంతమాత్రాన ఒప్పందం కుదురుతుందని చెప్పలేం. చివరకు ఏం జరుగుతుందో వేచి చూడాలి" అని పేర్కొన్నారు.

ఇరాన్‌పై భీకరదాడుల్ని పరిశీలిస్తున్నామని, దానిపై నిర్ణయం తీసుకుంటామని ముందు రోజు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి ఇరాన్ నుంచి కౌంటర్ వచ్చింది. అమెరికా బెదిరింపులకు తలొగ్గబోమని.. బలప్రయోగం, ఒత్తిడికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇరాన్‌కు ఆయుధాలు అమ్మవద్దని చైనా, రష్యాకు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

భవిష్యత్తులో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రైవేటు సంస్థల నుంచి పోటీ..

సమీక్షలో భట్టి మాట్లాడుతూ.. 'సింగరేణి మైనింగ్ నిపుణులు, ఇంజినీర్లు, కార్మికుల అనుభవాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుల్లో వినియోగించి సంస్థకు కొత్త ఆదాయ వనరులు సృష్టించాలి. జెన్‌కోతోపాటు ఇతర విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలి. బొగ్గు గనుల వేలం విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంతో ప్రైవేటు సంస్థలతో పోటీ పెరిగింది. బీఎస్ఎన్ఎల్ వంటి పరిస్థితి సింగరేణికి రాకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలి.

పెరిగిన విద్యుత్ డిమాండు

ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండు రోజుకు 11 వేల నుంచి 16 వేల మెగావాట్లకు పెరిగింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీరు లేనందున 2 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచింది. యాదాద్రి, భద్రాద్రి, తదితర థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి. దానికి అనుగుణంగా కొత్త బ్లాకులను వేగంగా అభివృద్ధి చేయాలి' అని అన్నారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో సీఎండీ హరీశ్, కలెక్టర్ అంకిత్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నీట్ నినాదాల మధ్య 'వందేమాతరం' బిల్లు

సభ్యుల నిరసనల మధ్య కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ ప్రవేశపెట్టారు. సీపీఐ, సీపీఎం దీన్ని వ్యతిరేకించాయి. అదే సమయంలో నీట్ అంశంపై నినాదాలు చేస్తూ విపక్షాలు నిరసన కొనసాగించడంతో సభను సోమవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. ఆపై మళ్లీ సమావేశమయ్యాక విపక్ష సభ్యులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "ఇస్తిఫా దో" (రాజీనామా చెయ్) అని నినదించారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరం గీతానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ప్రధాన్ రాజీనామా కోరుతూ విపక్ష సభ్యులు పార్లమెంటు ఆవరణలోనూ నిరసన కొనసాగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీల సారథ్యంలో నినాదాలు చేశారు.

బ్యారేజీల నిర్వహణపై కేంద్రానికి లేఖ

శాస్త్రీయ ప్రమాణాల విషయంలో రాజీలేదు

సమీక్షలో అధికారులు స్పందిస్తూ.. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వశాఖ నుంచి వచ్చిన లేఖల్లోని వివరాలను వివరించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని లేఖల్లో పేర్కొన్నారని, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీ-ఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై మాత్రం మార్గదర్శకాలు ఇవ్వలేదని అధికారులు పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. 'బ్యారేజీల్లో శాస్త్రీయ పరిశీలన, సాంకేతిక పరీక్షలు అన్నీ కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్‌ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నాం. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీపడదు' అని పేర్కొన్నారు. అధికారులు మాట్లాడుతూ.. అన్నారం బ్యారేజీ ర్యాఫ్ట్ ఫౌండేషన్‌లో ఖాళీలున్నట్లు ఆధారాలు లభించాయని, ఇప్పుడు నీటిని నిల్వచేయడం సురక్షితం కాదన్నారు. 'మేడిగడ్డ' పునరుద్ధరణ పునరావాస డిజైన్ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని తెలిపారు. సమావేశంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపైనా సమీక్ష జరిగింది. నీటి కేటాయింపులు, ట్రైబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న అంశాలు పరిష్కారం కాకపోవడంతో డీపీఆర్ విషయంలో ముందుకు వెళ్లడంలేదని అధికారులు తెలిపారు.

అగ్రరాజ్యంలో నీటి గండం..
ఎండిపోతున్న అమెరికా నగరం

ప్రమాదంలో ఉంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న కరవు, పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక అవసరాలు, కొత్త నీటి వనరుల అభివృద్ధిలో జాప్యం వంటివి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.ఈ నగరంలో పారిశ్రామిక అభివృద్ధి శరవేగంగా జరగడం నీటి కొరతను మరింత తీవ్రతరం చేసింది. ముఖ్యంగా ఇక్కడ ఉన్న భారీ పెట్రోకెమికల్ పరిశ్రమలకు అత్యధిక మొత్తంలో నీరు అవసరం అవుతోంది. వాతావరణ మార్పుల వల్ల ఇప్పటికే తగ్గిపోయిన నీటి నిల్వలపై ఇది తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. నివేదికల ప్రకారం.. 2022లో నిర్మించిన ఒక ప్లాస్టిక్స్ కెమికల్ ప్లాంట్, నగరంలోని ప్రజలందరూ కలిసి ఒక రోజులో వాడే నీటిని ఒక్కరోజే కూలింగ్ కోసం వినియోగిస్తోందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు సముద్రపు నీటిని మంచి నీటిగా మార్చే డీశాలినేషన్ ప్లాంట్‌ను నిర్మించాలని ప్రణాళిక రచించారు. అయితే, నిధుల కొరత, నియంత్రణ సంస్థల అనుమతులు, స్థానిక వ్యతిరేకతల కారణంగా ఈ ప్రాజెక్టు ఏళ్ల తరబడి ఆలస్యమవుతూ వస్తోంది. మరోవైపు వాతావరణ మార్పుల వల్ల టెక్సాస్‌లో తరచుగా తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో నగరానికి నీటిని సరఫరా చేసే కీలక రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి.'ఇన్‌సైడ్ క్లైమేట్' న్యూస్ జర్నలిస్ట్ డైలాన్ బడ్డార్ మాట్లాడుతూ.. అమెరికాలోని ఇతర నగరాలతో పోలిస్తే కార్పస్ క్రిస్టీ నీళ్లు అయిపోయే స్థితికి అత్యంత చేరువలో ఉందని అన్నారు. ఇటీవలి వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, నగరంలో కేవలం ఏడాదికి సరిపడా నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఇది అత్యవసర పరిస్థితిగా పరిగణించాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుతం అధికారులు లోతైన భూగర్భ బావులు తవ్వడం, పరిశ్రమల కోసం వ్యర్థ జలాలను శుద్ధి చేసి తిరిగి వినియోగించడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అయితే, ఈ సంక్షోభం ప్రజల దైనందిన జీవితంపై ఇప్పటికే ప్రభావం చూపింది. ఇళ్లలో తోటలకు నీళ్లు పెట్టడం, కార్లు కడగడం వంటి వాటిపై కఠిన ఆంక్షలు విధించారు. పరిస్థితి మరింత దిగజారితే, నీటి సరఫరాలో కోతలు లేదా పరిమిత గంటల్లో సరఫరా వంటి చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సంక్షోభం కేవలం ఒక నగరానికే పరిమితం కాదని, పెరుగుతున్న జనాభా, వాతావరణ మార్పులు, తగ్గిపోతున్న నీటి వనరుల మధ్య సమతుల్యం సాధించడంలో ప్రపంచవ్యాప్తంగా నగరాలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఇది ఒక హెచ్చరికగా నిలుస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఎల్-నినో కారణంగా తీవ్ర నీటి కొరత.. మంత్రి నిమ్మల
రామానాయుడు కీలక ఆదేశాలు

ఎల్-నినో ప్రభావం, క్లిష్టమైన నీటి కొరత దృష్ట్యా ఇరిగేషన్ శాఖలోని పైస్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరి సెలవులను రద్దు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో దాదాపు 55 లక్షల మందికి తాగునీరు అందించాల్సి ఉందని... అందుకే ఈ నీటిని తాగునీటికి, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. సీలేరు జలాలను గోదావరి డెల్టా ఖరీఫ్ అవసరాల కోసం వాడుతున్నామని, మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే గోదావరి ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూస్తూ, పొలవరం కుడి కాలువ నీరు వృథా కాకుండా కృష్ణా డెల్టాకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఇక కృష్ణా డెల్టా పరిధిలో నాగార్జున సాగర్ నిండకుండానే వరి సాగు చేస్తే ఆ ప్రాంత రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ సీజన్‌లో సాగర్‌కు నీళ్లు రాకపోతే 2027 జూన్ వరకు పులిచింతల, పట్టిసీమ నీళ్లను తాగునీటి అవసరాలకే భద్రపరచుకోవాలని స్పష్టం చేశారు. పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 10 జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనిత 'ఎక్స్' అకౌంట్ హ్యాక్.. పోలీసులకు ఫిర్యాదు

వెలుగులోకి వచ్చింది.తన సోషల్ మీడియా ఖాతా హ్యాకింగ్‌కు గురైన విషయాన్ని గుర్తించిన అనిత తక్షణమే స్పందించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ ఐజీ రవికృష్ణతో కూడా మాట్లాడి పరిణామాలపై చర్చించారు.ఈ హ్యాకింగ్ వెనుక ఉద్దేశపూర్వక కుట్ర కోణం ఉండి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు... ఖాతాను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు, హ్యాకర్ల ఆచూకీని కనిపెట్టేందుకు ముమ్మర చర్యలు చేపట్టారు.

కేంద్రంతో సీజేపీ ప్రతినిధుల చర్చలు

దిల్లీలో పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆందోళనల కారణంగా సెంట్రల్ దిల్లీలో మూతపడిన రాజీవ్ చౌక్, మండీ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్లను తెరచినట్లు దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది.

సంక్షేమ విజయాలను ప్రజలకు చేరువ చేద్దాం

ఇంటింటి ప్రచార యాత్రను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పిలుపు





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 25)

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న " రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వం-సంక్షేమ విజయాలు ఇంటింటి యాత్ర " ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ విజయాలను వివరించి, విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించాలని, ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందించి, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను గురించి వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రచార యాత్ర నిర్వహణ, కార్యాచరణ పై చర్చించి, విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు.

యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదం
ఇద్దరికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం







(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 25)

మార్కాపురం జిల్లా కంభం-బేస్తవారిపేట హైవే యూటర్న్ సమీపంలో శనివారం లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అయ్యవారిపల్లి వైపు బైక్ పై వెళుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తివివరాలు తెలియాల్సివుంది.



వెలిగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన కొనకనమిట్ల ఎస్ఐ శ్రీకాంత్

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 25)

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ వెలిగొండ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, క్యూ లైన్లు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. తొలి ఏకాదశి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

తెలుగు

ప్రతి వార్త తెలుగు వైపు — తెలుగు దినపత్రిక

26.07.26 ఆదివారం

మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 25)

మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ చర్యలు వేగవంతం చేసింది. మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయానికి చెందిన భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి (ఈవో) గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదాయ శాఖకు చెందిన కొన్ని భూములు అక్రమ ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని తిరిగి దేవాలయ ఆధీనంలోకి తీసుకురావడానికి అధికారులు చట్టపరమైన చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కొంత భూమిని దేవుని పేరుపై రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని, మిగిలిన భూములను కూడా దశలవారీగా స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆలయ ఆస్తుల పరిరక్షణ ప్రతి భక్తుడి బాధ్యత అని పేర్కొంటూ, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు, భక్తులు సహకరించాలని ఆయన కోరారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఈవో తెలిపారు.

రెండేళ్లలోనే ప్రజలకు ఎంతో మేలు చేశాం

కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

4



పొగాకు రైతులను ఆదుకోవాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జులై 25)

రాష్ట్రంలోని పొగాకు రైతులను ఆదుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు చేపడుతున్న నిరంతర సంప్రదింపులతో రాష్ట్రంలోని పొగాకు రైతుల సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి ఆ శాఖ అదనపు సెక్రటరీ నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ ను రాష్ట్రానికి పంపింది. కర్నూలు జిల్లా పర్యటనకు బయలు దేరే ముందు సీఎం చంద్రబాబుతో వీరు భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి,



4

- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- రైతుల సంక్షేమానికి ప్రధాన ప్రాధాన్యత
- సమస్య పరిష్కారానికి బయ్యర్లూ సహకరించాలి
- సీఎం చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు సెక్రటరీ, డైరెక్టర్ల భేటీ
- నిరంతర సంప్రదింపులతో వాణిజ్య మంత్రిత్వశాఖ
- ప్రతినిధులను రాష్ట్రానికి పంపిన కేంద్రం
- పొగాకు రైతులను ఆదుకునేలా 3 ప్రతిపాదనలు సిద్ధం

టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా ఏనుగుంటి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 25)

టీడీపీ పీసీపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా ఏనుగుంటి శ్రీనివాసులు నియమితులైనట్లు తెలుస్తుంది. మండలంలోని గుదెవారిపాలెంకు చెందిన శ్రీను ను పీసీపల్లి మండల టీడీపీ అధ్యక్షునిగా నియమించాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి టీడీపీ అధిష్టానానికి ప్రతిపాదనలు పంపారు. ఆదివారం నూతన మండల పార్టీ అధ్యక్షులు ఏనుగంటి శ్రీను అధ్యక్షతన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం పై టిడిపి నాయకులు, పార్టీ బాధ్యులకు అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశం పెదఇర్లపాడు రోడ్డులోని ప్రాధమిక (తరువాయి 4లో...)

మార్కాపురం జిల్లా డిపిఆర్ఓగా సందీప్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

షణ్ముఖ వెలుగుతో డిపిఆర్ఓ సందీప్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 25)

మార్కాపురం జిల్లా డిపిఆర్ఓగా డి సందీప్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జరిపిన బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా సమాచార శాఖ లో ఏపిఓ(పి) పబ్లిసిటీ సెల్ అధికారిగా పని చేస్తూ మార్కాపురంకు పదోన్నతిపై వచ్చారు. శనివారం తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ఆయన మార్కాపురం జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన షణ్ముఖ వెలుగు ప్రతినిధులు ఆయనకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాసేపు ఆయనతో పలు విషయాలు మాట్లాడారు. తన సర్వీస్‌లో అధిక శాతం ఢిల్లీలో నిర్వహించానన్నారు. తాను ఎక్కడ పని చేసినా జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తానన్నారు. సమాజంలో ప్రజల సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు చూపే చొరవ మంచిదన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొనే సమస్యలు ఏమైనా ఉంటే తనకు నేరుగా తెలియజేయాలని వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ ప్రాంతం పూర్తిగా కొత్త అని కాని ఉద్యోగం కొత్త కాదన్నారు. ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఎదురైతే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకుందామన్నారు. ప్రతి జర్నలిస్టు తనకు ముఖ్యమని, మీరు, మేము కలిసి పని చేసి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను మీ పత్రికల ద్వారా ప్రజలకు మరింత వేగంగా తెలియజేయాలని కోరారు.





జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు : నూతనంగా మార్కాపురం జిల్లా డిపిఆర్ఓగా శనివారం బాధ్యతలు స్వీకరించిన డి సందీప్ అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు కలెక్టర్ ఎం విజయసునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

వీబీజీరామ్‌జీ పథకంలో డ్రాగన్ మొక్కలను నాటిన ఎమ్మెల్యే సాంబన్న


మామిడి, డ్రాగన్ ఫ్రూట్ తోటలను పరిశీలించిన ఎమ్మెల్యే ఏలూరి



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జులై 25)

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో రైతులకు శాశ్వత జీవనోపాధి లభిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులకు పిలుపునిచ్చారు. శనివారం కోనంకి కొల్లలపూడి రెవెన్యూ పరిధిలో వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రూరల్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ-జీ రామ్‌జీ) ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శనివారం చేపట్టిన పండ్ల తోటల పెంపకం కార్యక్రమంలో భాగంగా డ్రాగన్ మొక్కలను నాటే కార్యక్రమంలోపర్చూరు ఆయన పాల్గొన్నారు. రైతుల పొలాల్లో స్వయంగా కొత్తగా డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటిన ఎమ్మెల్యే ఏలూరి, ఇప్పటికే సాగులో ఉన్న డ్రాగన్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో ఇది ఒక విశిష్టమైన ఘట్టమని, రైతుల పొలాల్లో ఒకే రోజు 50 వేల ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటే మహోత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. "గ్రామీణ ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ, జీవనోపాధుల భద్రత కల్పించడమే లక్ష్యంగా 2026-27 ఆర్థిక (తరువాయి 4లో...)

పొగాకు రైతులను ఆదుకోవాలి





వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ ఉన్నతాధికారులు, టుబాకో బోర్డు ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేలా సిద్ధం చేసిన 3 ప్రతిపాదనలపై సీఎంతో కేంద్ర ప్రతినిధులు చర్చించారు. వడ్డీ లేకుండా వర్కింగ్ క్యాపిటల్ రుణాల జారీ, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి ప్రతిపాదనలను రూపొందించారు. ఈ ప్రతిపాదనల పై పూర్తి స్థాయిలో చర్చించాలని, ఏ నిర్ణయం తీసుకున్నా పొగాకు రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇదే సయయంలో ప్రతేడాది పొగాకు రంగంలో ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, షార్ట్ టర్మ్, మీడియం టర్మ్, లాంగ్ టర్మ్ వ్యూహాలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. కేంద్రం వైపు నుంచి ఏ మేరకు సాయం అందించగలరు... రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి తీసుకోవాల్సిన చర్యల పైనా చర్చించి తుది నిర్ణయానికి రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఇలా అందరూ స్టేక్‌హోల్డర్లేనని, అందరి బాధ్యతతోనే సమస్యకు పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలను కూడా దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పంటను ఒకటి, రెండేళ్లు నిల్వ ఉంచే అవకాశాలున్నాయా..? ధరలు స్థిరపడిన తర్వాత విక్రయించుకోవచ్చా.. అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లో, మీడియం, హై గ్రేడ్ పొగాకును మార్కెట్‌లో ఎలా విక్రయించాలనే దాని పైనా ట్రేడర్లతో మాట్లాడి ఓ కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. పొగాకు రంగంలో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థ అవసరమన్నారు. సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో రైతుల ప్రయోజనాలకు హై ప్రయారిటీ ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇదే సమయంలో ట్రేడర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఓ నిర్ణయానికి వస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చక్కటి విధానాన్ని రూపొందించవచ్చని సీఎం సూచించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లీడ్ తీసుకుని చర్చలను కొనసాగించాలని సూచించిన ముఖ్యమంత్రి కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరారు. ఈ సమావేశం సందర్భంగా మంత్రులు గొట్టిపాటి, డీబీవీ స్వామి, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా నరసరావుపేట, రాజానగరం, పోలవరం నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రేడర్లతో కేంద్రం సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఈ సమావేశానికి వర్చువల్‌గా మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు.

ట్రేడర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు

సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరిన అనంతరం పలువురు ముఖ్యమైన పొగాకు బయ్యర్లతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో కలిసి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వర్చువల్ గా సమావేశమయ్యారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే టుబాకో బోర్డు ముందుకు వచ్చాయని.. రైతులకు మేలు చేసేలా బయ్యర్లు కూడా ఓ అడుగు ముందుకు వేయాలని పెమ్మసాని సూచించారు. రైతులు నష్టపోకుండా ట్రేడర్ల వైపు నుంచి ఏమేం చేయగలరోననే అంశాన్ని చర్చించుకుని మంచి ప్రతిపాదనలతో రావాలని కోరారు. సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ డైరెక్టర్ మురళీకృష్ణకు ఘన సన్మానం









(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూలై 25) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ స్టేట్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తుడిమల్ల మురళీకృష్ణని బద్వేల్ నియోజకవర్గ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనకు పూలమాలలు వేసి, దుశ్శాలువా కప్పి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిశెట్టి సుప్రజ బిజెపి నాయకులు నాగేంద్ర మాట్లాడుతూ మురళీకృష్ణ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పౌరసరఫరాల శాఖలో మరింత పారదర్శకతకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఆయన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకటసుబ్బయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిన్ని సుబ్బారావుతో పాటు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

రెండేళ్లలోనే ప్రజలకు ఎంతో మేలు చేశాం



(షణ్ముఖ వెలుగు, కొండపి, జూలై 25)

కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. శనివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం ఐఓసి సమీపంలోని దామచర్ల సత్య కార్యాలయంలో కొండపి నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి ఇంటికీ చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు లబ్ధిదారుల అభిప్రాయాలు, కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ప్రచార వివరాలను మై టీడీపీ యాప్‌లో క్రమబద్ధంగా నమోదు చేయాలని తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధముగా రెండేళ్లలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. కొండపి నియోజకవర్గంలోనే ఈ రెండేళ్లలో రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నామని తెలిపారు. అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీ శక్తి వంటి సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు.

మరోవైపు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చి ఇంకొక వైపు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. పొగాకు కొనుగోళ్ల సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. త్వరలోనే పింఛన్లు, నూతన గృహాలు మంజూరు చేస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపి నియోజకవర్గానికి చెందిన మండల, గ్రామ స్థాయి పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



సంవత్సరంలో సుమారు లక్ష ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, చిన్న-సన్నకారు రైతుల భూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇది కేవలం మొక్కలు నాటడానికే పరిమితం కాదు.. రైతులకు స్థిరమైన జీవనోపాధి కల్పించడం, ఉత్పాదక ఆస్తులను సృష్టించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన గొప్ప ఉద్యమం" అని పేర్కొన్నారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి...

కనీసం 0.25 ఎకరం నుంచి గరిష్ఠంగా 2.50 ఎకరాల వరకు మామిడి, జీడిమామిడి, బత్తాయి, నిమ్మ, జామ, కొబ్బరి, సపోటా, దానిమ్మ, యాపిల్‌బేర్, సీతాఫలం, నేరేడు, చింత, ఆయిల్‌పామ్‌తోపాటు డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక ఆదాయాన్నిచ్చే పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి గుర్తుచేశారు. మొక్కల కొనుగోలు, గుంతలు తీయడం, నాటడం, ఎరువుల వినియోగం, సంరక్షణ వంటి పనులకు రెండు నుంచి మూడేళ్ల పాటు ఎకరానికి రూ.1.00 లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఐదో ఏడాది నుంచి ఎకరాకు ఏటా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. "డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టే రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సబ్సిడీలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని, శాశ్వత ఆదాయ వనరుగా మలచుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. తొలుత ఎమ్మెల్యే ఏలూరి కోనంకి గ్రామంలో పర్యటించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పలువురికి ఎమ్మెల్యే ఏలూరి ఆత్మీయ పలకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటి నాగేశ్వరరావు, కోటపాటి సురేష్, శ్రీరాములు, ధూళిపాల హరిబాబు, గునుగుంట్ల ఆంజనేయులు, సాంబయ్య, హనుమంతరావు, ఏసు పాదం, అమరేష్, లీలా కృష్ణ , ఏపీవో లక్ష్మీనారాయణ, ప్రకృతి వ్యవసాయం హెచ్ఆర్ నంద, రైతువ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా ఏనుగుంటి

ఆరోగ్య కేంద్రం ఎదురుగా గల నూతన పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు శ్రీను విలేకరులకు తెలిపారు. శ్రీను 2002లో మండల టీడీపీ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం ఉంది. తన సొంత పంచాయతీ అయిన గుదెవారిపాలెం పంచాయతీ టిడిపికి కంచుకోటగా ఉంటుంది. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పీసీపల్లి మండలంలో పారిశ్రామిక కారిడార్, బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌ల సహకారంతో వాటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కనిగిరి నియోజకవర్గంలోనే ఎమ్మెల్యే ఉగ్ర రెండేళ్ళ పదవీ కాలంలో పీసీపల్లి మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. కానీ మండలంలో టీడీపీ పార్టీ ఆశించినంత మేర ఊపందుకోలేదనే విమర్శలున్నాయి. ఏనుగంటి శ్రీను 18 పంచాయతీల్లోని టిడిపి క్యాడర్‌ను సమన్వయం చేసుకుని వెళ్ళే సత్తా ఉండడంతో ఆయనను నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. నూతన అధ్యక్షుడితో మండలంలో టిడిపి మరింత బలోపేతం కావడం ఖాయమని టిడిపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన ఏనుగంటి శ్రీను వెలుగు ప్రతినిధితో మాట్లాడుతూ అహర్నిశలు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మండలంలో చేసిన అభివృద్ధి పనులను, జరగాల్సిన పనుల పై ప్రజల్లో అవగాహన పెంచి తటస్థులను సైతం టిడిపి వైపు ఆకర్షితులయ్యేలా కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలాన్ని టిడిపి కైవసం చేసుకోవడంతో పాటు 18 పంచాయతీల్లో టిడిపి బలపరిచే సర్పంచ్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర తన పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు.

సాయిల్ హెల్త్ కార్యక్రమం నిర్వహణ పై విద్యార్థులకు అవగాహన









(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 25)

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ 2 స్కూల్ నందు "స్కూల్ సాయిల్ హెల్త్ కార్యక్రమం" మండల వ్యవసాయ అధికారి పి జోష్నాదేవి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టి ఆరోగ్యం ప్రాముఖ్యత, మట్టి నమూనాల సేకరణ పద్ధతి, మట్టి పరీక్షల అవసరం, సాయిల్ హెల్త్ కార్డు ఉపయోగాలు, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ పదార్థాల వినియోగం, సూక్ష్మ పోషకాల ప్రాధాన్యత, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయాధికారి ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా పంటల దిగుబడులు పెరగడంతో పాటు సాగు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులని, నేల ఆరోగ్య పరిరక్షణ పై అవగాహనను తమ కుటుంబ సభ్యులు, రైతులకు చేరవేసి సుస్థిర వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బిటియం దివ్యభారతి, విహెచ్ఏ సుస్మిత, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి, టీచర్స్ సునంద, శ్రీగోపి, శ్రవణ్, ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఉప్పుటూర్లో ఫలించిన దాసరి కృషి





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 25)

బాపట్ల జిల్లా పర్చూరు మండలంలోని ఉప్పుటూరు నందు శనివారం ఉదయం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు, జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ దాసరి చంద్రశేఖర్, మండల అధికారులు, గ్రామస్థులు పాత ప్రభుత్వ హోమియో వైద్యశాల ఖాళీ స్థలం నందు నూతన ఆసుపత్రి భవన నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు మరియు జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ దాసరి చంద్రశేఖర్ భూమి పూజ కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి, మొదటి తాంబూలాన్ని షేక్ షంషుద్దీన్కు అందించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, కాంట్రాక్టర్ రావి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాలేరు శ్రీనివాసరావు, సుబ్బయ్య, షేక్ హుస్సేన్, వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది అంకమ్మరావు, కానాల వెంకటేష్, తదితరులు భూదేవికి పూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ త్వరితగతిన పనులు ప్రారంభించి పర్చూరు మండలం గర్వించే విధంగా ఉప్పుటూరులో అన్ని రకాల వసతులతో ప్రభుత్వ హోమియో వైద్యశాల నిర్మాణాన్ని చేపడితేనే, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఉప్పుటూరులో ఉన్న ఏకైక వైద్యశాల ఇదేనని, లేదంటే ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం పర్చూర్ కి వెళ్ళవలసిందేనని అన్నారు. అనంతరం కాంట్రాక్టర్ రావి శ్రీనివాసరావు గ్రామస్తులతో మాట్లాడుతూ ఉప్పుటూరులో ఈ రోజు నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభమవడంలో మీ ఊరి డాక్టర్ చంద్రశేఖర్ కృషి ఎంతగానో ఉందని, ఉప్పుటూరులో నూతన ఆసుపత్రి భవనం నిర్మించాలన్న ఆసక్తి ప్రజల కన్నా డాక్టర్కే ఎక్కువ ఉందని ఇలాంటి డాక్టర్ ఊరికి దొరకడం మీ అదృష్టమని అన్నారు. ఎట్టకేలకు ఉప్పుటూరిలో నూతన హోమియో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు, రోగులు హర్షాన్ని వ్యక్తం చేశారు.

తొలి ఏకాదశి సందర్భంగా శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

తొలి ఏకాదశి పర్వ దినంతో పాటు శనివారం కూడా కలిసి రావడంతో ఒంగోలు లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు ఝామునుండే వేల సంఖ్యలో భక్తులు భారీగా శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. భక్త జన సందోహంతో క్యూ లైన్లు కిటకిటలాడాయి. భక్త జన ప్రవాహంతో శ్రీగిరి మరో దివ్య తిరుమలగా భాసించింది. భక్తుల గోవింద నామాలతో శ్రీగిరి ప్రతిధ్వనించింది. తొలి ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార ఆత్రేయ, తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.









పొగాకు కొనుగోలుకు రూ.1,000 కోట్లు కేటాయించాలి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 25)

మండల కేంద్రమైన పొన్నలూరులో ఎస్.కె ఎం నియోజకవర్గ నాయకులు కేజీ మస్తాన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జయంతి బాబు మాట్లాడుతూ వర్జినియా పొగాకు గిట్టుబాటు ధర రావాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం 1000 కోట్లు కేటాయించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం మన ఆందోళనలు ఉధృతం చేసిన తర్వాత వ్యాపారులు, బోర్డు అధికారులతో చర్చలు జరిపిన ఫలితం శూన్యమని ముఖ్యమంత్రి ఆదేశాలలో సైతం కంపెనీలు బే ఖాతారు చేస్తున్నాయని తెలిపారు. కిలో పొగాకు 200 రూపాయలు తగ్గకుండా ధర ఇవ్వాలని, నోబిడ్లు తగ్గించాలని అన్నారు. జూలై 29న జాతీయ రహదారి దిగ్బంధాన్ని జయప్రదం చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు సిహెచ్ సాగర్, రైతులు, కంచర్ల రాము, అనుమోలు సురేష్, గడ్డం ప్రసాద్, నేలపాటి రాజేష్, ఆదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థుల ఒత్తిడికి తలొగ్గి గత్యంతరం లేక రాజీనామా చేసిన సందర్భంగా శనివారం జిల్లా, నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు ఒంగోలు బాబూజీ కాంప్లెక్స్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సత్యమేవ జయతే అంటూ నినాదాలు చేస్తూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ పతాకాలను చేతబట్టి బాణసాంచా కాల్చి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ తెలుగువారి తొలి పండుగ తొలి ఏకాదశి రోజు భారతదేశంలో ప్రజాస్వామ్యం విజయం సాధించిందని, బిజెపికి, మోడీ ప్రభుత్వానికి పోయేకాలం దాపరించిందని ఆయన అన్నారు విద్యార్థుల మీద దాడికి నైతిక బాధ్యతగా ప్రధాని మోడీ రాజీనామా చేయాలని ఆయన కోరారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవి రెడ్డి ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇది విద్యార్థుల విజయమని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం మాట్లాడుతూ మోడీ పదే పదే మాట్లాడే అచ్చేదిన్ ఈరోజు ఈ దేశానికి వచ్చాయని మోడీకి బిజెపి ప్రభుత్వానికి సచ్చేదిను వచ్చాయని ఆయన వ్యంగ్యంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పై దాడికి బేషరతుగా ప్రధాని మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలని కోరారు. కొండేపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతి సతీష్ మాట్లాడుతూ విధి విద్యార్థుల విజయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, గోరంట్ల కోటేశ్వరరావు, కాకర్లపూడి వేణు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శులు షేక్ రఫూఫ్, పైనం మధు, శ్రీనివాసరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టి సుబ్బారావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొంటుగుంట సుబ్బారావు, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షులు సుదర్శన్ రవి, కొప్పోలు సుబ్బారావు, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మహేష్, గిడ్డియన్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి మేల్ చాట్ వస్త్రాలు సమర్పణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పేర్నమిట్ట సుస్మిత్ కుటుంబ సభ్యులు మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సుస్మిత్ కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం అంద చేశారు. మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన సుస్మిత్ కుటుంబ సభ్యులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

ఎల్లంపల్లి తిరుమలనాథస్వామి ఆలయంలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

శోభాయమానంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ తిరుమలనాథస్వామి వారి దివ్య అలంకరణ

25 విశేషపూజల్లో పాల్గొని తరించిన భక్తులు





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 25)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీదేవి, శ్రీ భూదేవి సమేత శ్రీ శ్రీ శ్రీ తిరుమలనాథస్వామిలి వారి ఆలయంలో ఆషాఢమాస తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం విశేష పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి మూలవిరాట్ అభిషేకాలు, విశేష అర్చనలు, అష్టోత్తర శతనామావళి పూజలు శాస్త్రోక్తంగా సాగాయి. ఈ పవిత్ర శయన ఏకాదశి పర్వదినాన స్వామివారిని, ఉభయ నాంచారులైన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వివిధ రకాల గుబాళించే దివ్య సుగంధ పుష్పమాలలతో, పట్టు వస్త్రాలతో, రత్నఖచిత స్వర్ణాభరణాలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామివారి శంఖ చక్ర అభయహస్త దివ్య మంగళ రూపాన్ని భక్తులకు కంటికి ఇంపుగా దర్శనమిచ్చేలా అలంకరించగా, స్వామివారి దివ్య రూపాన్ని చూసి భక్తజనం పరవశించిపోయారు. తొలి ఏకాదశి సందర్భంగా మైదుకూరు పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాలు “ఓం నమో నారాయణాయ”, “గోవిందా గోవిందా” నామస్మరణతో మారుమోగాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు

పేదల వైద్యానికి ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే ఎలూరి చొరవతో ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ ఆసరా

రూ.2.72 లక్షల విలువైన ఎల్ఓసీలు మంజూరు

ఎల్ఓసి చెక్కులు అందించిన ఎమ్మెల్యే ఏలూరి



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జులై 25)

పేదల అత్యవసర వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయని ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పేదలకు ఆధునిక వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. వేలాది కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిది అండగా ఆసరాగా నిలుస్తుందన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి కృషి....

పర్చూరు ఎమ్మెల్యే ఎలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని ముగ్గురు నిరుపేద రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా చికిత్స నిమిత్తం లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి గురువారం ఈ ఎల్ఓసీలు జారీ అయ్యాయి. యద్దనపూడి మండలం, యనమదల గ్రామానికి చెందిన దుడ్డు అనతకు చిలకలూరిపేటలోని ఆర్కే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం రూ.1,01,536 మంజూరు చేశారు. పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన షేక్ ఫాతిమాకు చీరాలలోని మాణిక్యమ్మ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స కోసం రూ.50,000 లు మంజూరైంది. చినగంజాంలోని గొనసపూడికి చెందిన యామల అంజయ్యకు ఒంగోలులోని కిమ్స్ కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స నిమిత్తం రూ.1,21,329 మంజూరు చేశారు. మొత్తంగా ముగ్గురు రోగులకు రూ.2,72,865 విలువైన చికిత్స మొత్తాలు మంజూరు చేశారు. రోగుల కుటుంబ సభ్యులు స్థానిక నేతలను విషయాన్ని వెల్లడించడంతో నేతలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి సమస్యను తీసుకురావడంతో ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖలు రాయడంతో ఈ సాయం సత్వరమే మంజూరైంది. నియోజకవర్గంలో పేద రోగులకు ఎప్పటికప్పుడు ఇలాంటి సాయం అందించేందుకు కృషి చేస్తున్నానని, అవసరమైన వారు తనను సంప్రదిస్తే సీఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్స సాయం అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

ఆర్యవైశ్య వివిధ విభాగాల మండల కార్యవర్గాల నియామకం



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 25)

వైఎస్ఆర్ కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, సేవాదళ్, మహిళా మండలి మైదుకూరు మండల నూతన కార్యవర్గాలను శుక్రవారం రాత్రి స్థానిక అమ్మవారి శాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ సలహాలు, సూచనల మేరకు ఈ కమిటీలను పూర్తి చేసినట్లు నాయకులు తెలిపారు.

నూతన కమిటీల వివరాలు:

యువజన సంఘం మండల కమిటీ అధ్యక్షులు తులసి సత్యసాయి, కార్యదర్శి భూపాల ఉపేంద్ర, కోశాధికారి జొన్నలగడ్డ మనోజ్,

ఆర్యవైశ్య సేవాదళ్ మండల కమిటీ అధ్యక్షులు అయ్యప్ప శెట్టి సురేంద్ర, కార్యదర్శి వాకాటి వెంకటరమణ, కోశాధికారి నాగేల్ల శేషుబాబు, మహిళా మండలి మండల కమిటీ కోశాధికారి మిట్టా హేమలతలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నిర్వాహకులు మాట్లాడుతూ సమాజ సేవే ధ్యేయంగా, ఆర్యవైశ్యుల సంక్షేమానికి, సంఘ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు ఆర్యవైశ్య అధ్యక్షులు బల్లాణి చెన్నకేశవ ప్రసాద్, ఉపాధ్యక్షులు దొంతు వెంకటసుబ్బయ్య, జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గురు ప్రసాద్, మండల అధ్యక్షులు నూకల సత్యనారాయణ, సభ్యులు కోట సంజీవయ్య గుప్తా, ఇమ్మిడిశెట్టి సతీష్ బాబు, ఆలంపల్లి జనార్దన్, ధోనిపర్తి ఆయువారప్ప, మహిళా మండల అధ్యక్షురాలు బల్లాని సునంద, మహిళా మండలి మండల అధ్యక్షురాలు వంకదారి వాసంతి, భూపాలం విజయ, భూపాలం లతతో పాటు పలువురు మహిళా మండలి సభ్యులు, సంఘ బంధువులు పాల్గొన్నారు.





అభివృద్ధి పనులకు రూ.137 కోట్లు ఇవ్వండి

ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం నుంచి రాళ్లపాడు రిజర్వాయర్ వరకు డబుల్ రోడ్డు

6 చోట్ల చెక్ డ్యాముల నిర్మాణానికి ప్రతిపాదన



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 25)

కందుకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.137 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి విజ్ఞప్తి చేశారు. శనివారం తాడేపల్లిలో ముఖ్యమంత్రిని కలిసి పలు ప్రతిపాదనలను ఆయనకు అందజేశారు. ప్రధానంగా కందుకూరు-ఉదయగిరి నియోజకవర్గాలను అనుసంధానం చేసే రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి గారికి నాగేశ్వరరావు వివరించారు. వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు రిజర్వాయర్ వరకు 12 కిలోమీటర్ల సింగిల్ రోడ్డును వెడల్పు చేసి, డబుల్ రోడ్డుగా మార్చాలని విన్నవించారు. పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, కొత్తగా తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. అందు కోసం రూ.25 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఇక రైతులకు సాగునీరు అందించడం, భూగర్భ జలాలను పెంచాలన్న లక్ష్యంతో నియోజకవర్గంలో 6 చోట్ల చెక్ డ్యాముల నిర్మాణానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు, ప్రతిపాదనలు తయారు చేయించి ముఖ్యమంత్రికి అందజేశారు. పాలేరు నదిపై కందుకూరు మండలం పలుకూరు వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ.25 కోట్లు, విక్కిరాలపేట వద్ద నిర్మాణానికి రూ.23 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. ఉప్పుటేరుపై గుడ్లూరు వద్ద నిర్మాణానికి రూ.19 కోట్లు, లింగసముద్రం మండలం చినపవని వద్ద నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరు చేయాలన్నారు. ఇంకా వలేటివారిపాలెం మండలం శామీరపాలెం (కూనిపాలెం) వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ.3 కోట్లు, మన్నేరు పై కలవళ్ల వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఇంకా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే ఇంటూరి ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే రోజుల్లో కందుకూరు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగ యువకులకు భారీ స్థాయిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
7 | 26.07.26 ఆదివారం

ఉద్యాన పంటల రక్షణకు ‘ఫార్మ్ పాండ్’, ‘వీడ్ మాట్’ సబ్సిడీలు

మైదుకూరు ఉద్యానశాఖ అధికారి సి రామకృష్ణ







(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 25)

మండల వ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న దృష్ట్యా, తోటలను కాపాడుకునేందుకు ఉద్యాన శాఖ ద్వారా ఫార్మ్ పాండ్‌లు (వ్యవసాయ కుంటలు), వీడ్ మాట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం భారీగా రాయితీలు అందిస్తోందని మైదుకూరు ఉద్యానశాఖ అధికారి సి. రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు.

రాయితీల వివరాలు:

వ్యక్తిగత ఫార్మ్ పాండ్‌లు : 20/20/3 మీటర్ల కొలతలతో నిర్మించుకునే కుంటలకు రూ. 1,80,000 ఖర్చవుతుండగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ కింద రూ. 90,000 అందిస్తోంది. కమ్యూనిటీ (సామూహిక) ఫార్మ్ పాండ్‌లు: రైతులు గ్రూప్‌గా ఏర్పడి 100/100/3 మీటర్ల విస్తీర్ణంలో నిర్మించుకునే సామూహిక కుంటలకు అయ్యే రూ. 24,00,000 వ్యయంలో ఏకంగా 75 శాతం సబ్సిడీగా రూ.18,00,000 ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ఇస్తుందన్నారు. వీడ్ మాట్: కలుపు నివారణ మ్యాట్ బత్తాయి, నిమ్మ, మామిడి, దానిమ్మ తోటల్లో నీటి ఆవిరిని అరికట్టేందుకు, కలుపు నివారణకు వీడ్ మాట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చదరపు మీటరుకు అయ్యే రూ. 50 వ్యయంలో ఉద్యాన శాఖ 50 శాతం (రూ.25) రాయితీ ఇస్తోందన్నారు. ఈ వెసులుబాటు ఒక్కో రైతుకు గరిష్టంగా 4,000 చదరపు మీటర్ల విస్తీర్ణానికి వర్తిస్తుందని చెప్పారు.

కావలసిన ధ్రువపత్రాలు:

ఈ పథకాల ప్రయోజనం పొందాలనుకునే అర్హులైన రైతులు తమ సమీప గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డ్, 1 బి, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన అధికారి కోరారు.

బ్రహ్మంగారి మఠంలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

పీఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో 24 గంటల అఖండ భజన ప్రారంభం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 25)

జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామివారి మఠంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధల నడుమ ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం తొలి ఏకాదశి సందర్భంగా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు స్వామివారి మండపంలో శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల దివ్య మూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కృప అందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ “అఖండ ఏక నామస్మరణ భజన” కార్యక్రమాన్ని పీఠాధిపతులు లాంఛనంగా ప్రారంభించారు.

24 గంటల అఖండ భజన మహోత్సవం :

ఈ ఆధ్యాత్మిక భజన కార్యక్రమం జూలై 25 శనివారం ఉదయం 6:30 గంటలకు ప్రారంభమై, జూలై 26 ఆదివారం ఉదయం 6:30 గంటల వరకు 24 గంటల పాటు అఖండంగా కొనసాగుతుందని మఠం యాజమాన్యం వెల్లడించింది.

కన్నులపండువగా భజన బృందాల నామస్మరణ :

ఈ భజన మహోత్సవంలో బ్రహ్మంగారిమఠం మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భజన బృందాలు విశేషంగా పాల్గొన్నాయి. ముఖ్యంగా బ్రహ్మంగారిమఠం, సోమిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన భజన బృందాల సంకీర్తనలు, తాళ మృదంగ ధ్వనులతో మఠ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది, మండల నలుమూలల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 25)

డాక్యుమెంట్ రైటర్స్ ఈ నెల 20వ తేదీ నుండి నమ్మెకు దిగిన నేపథ్యంలో కమీషనర్, ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ, ఆంధ్రప్రదేశ్ వారు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి ప్రజలకు నిరంతరాయంగా రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు డాక్యుమెంట్ రైటర్లు సమ్మెలో ఉన్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా , సులభతరంగా అందించుటకు పబ్లిక్ ఎంట్రీ విధానం అమలులో ఉందన్నారు. మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ప్రజలకు తెలియజేయడం ఏమనగా క్రయ, విక్రయాలు, దానపత్రాలు, సిటిల్మెంట్లు, విభజన పత్రాలు, తనఖా పత్రాలు, ఇతర రిజిస్ట్రేషన్ పత్రాలకు సంబంధించిన వివరాలను పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా నమోదు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసుకోవచ్చన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని సిబ్బంది ద్వారా ప్రజలకు పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా రిజిస్ట్రేషన్లు, ఇతర అన్ని సేవలు అయిన రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాల నమోదు, డాక్యుమెంట్ తయారీకి అవసరమైన సమాచార నమోదు, దరఖాస్తు పూర్తి చేయడం, స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని దశల్లో ప్రజలకు పూర్తి సహాయ, సహకారాలు, మార్గదర్శకత్వం అందించబడుతుందన్నారు. అందువల్ల ప్రజలు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించకుండా ప్రజలు అవసరమైన ఆస్తి పత్రాలు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఇతర సంబంధిత పత్రాలతో నేరుగా మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి ఈ సేవలను నేరుగా మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యలయం నుండి పొందవచ్చన్నారు.

ఈ సేవల ద్వారా కలిగే ప్రయోజనాలు :

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుంది. ప్రజల సమయం, శ్రమ ఆదా అవుతుంది. వివరాలలో పొరపాట్లు తగ్గుతాయి. పారదర్శకమైన, సులభమైన ,నాణ్యమైన సేవలు అందుతాయి. ప్రజలకు కార్యాలయంలోనే సమగ్ర సహాయం లభిస్తుంది. అందిస్తున్న సేవలను వినియోగించుకోవలసిందిగా కోరారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సద్వినియోగం చేసుకొని, రిజిస్ట్రేషన్ సేవల కోసం నేరుగా కార్యాలయాన్ని సంప్రదించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగంచకోవాలని కోరారు. ప్రజలకు వేగవంతమైన పారదర్శక మైన నాణ్యమైన రిజిస్ట్రేషన్ సేవలను అందిచటం ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు.

డాక్యుమెంట్ రైటర్లతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్లు

పొదిలి సబ్ రిజిస్ట్రార్ నీరజ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 25)

తమ వివిధ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీ నుంచి దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో పొదిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలందించే విషయంలో ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు సబ్ రిజిస్ట్రార్ నీరజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్లతో ప్రమేయం లేకుండానే, నేరుగా కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యాలయ సిబ్బందే ప్రజలకు కావాల్సిన డాక్యుమెంటేషన్ ప్రక్రియలో తగిన సాయం అందిస్తారని చెప్పారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రజలకు సేవలు నిరంతరాయంగా అందించడమే తమ ప్రాధాన్యమని పేర్కొన్నారు. కాబట్టి పొదిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, రిజిస్ట్రేషన్ల కోసం నేరుగా ఆఫీసును సంప్రదించాలని ఆమె కోరారు.

రోడ్డు భద్రతే ప్రాణ రక్షణ

మేదరమెట్లలో భారీ అవగాహన ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, మేదరమెట్ల, జులై 25)

రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు మెదరమెట్ల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజుఆదేశాల మేరకు దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున పర్యవేక్షణలో మేదరమెట్ల ఎస్ఐ టి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది పాల్గొన్నారు. రాధా గీతం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, ఆటో, లారీ డ్రైవర్లు, వాహనదారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల గుండా సాగిన ర్యాలీలో రోడ్డు భద్రతకు సంబంధించిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం, మొబైల్ ఫోన్ వినియోగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలు, రహదారి సూచికలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే పాదచారులు, అత్యవసర సేవల వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణించరాదని అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన మానవహారంలో “ప్రతి ప్రాణం అమూల్యం–రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత“ అనే సందేశాన్ని ప్రజలకు చాటిచెప్పారు. ఎస్ఐ టి రమేష్ బాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, లేన్ క్రమశిక్షణను అనుసరించి, అప్రమత్తంగా వాహనాలు నడిపితే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాధాస్ గీతం హైస్కూల్ ప్రిన్సిపాల్ రాధా, సతీష్, అన్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం ఉండాల్సిందే

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

సమకాలీన రాజకీయ పోరాటాలలో పెద్ద విజయం

మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చాపాటి రామ సుధాకర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 25) నీట్ పరీక్ష లీకేజ్ పైన గత కొన్ని రోజులుగా జరుగుతున్న నిరసనలు ముఖ్యంగా విద్యార్థులు యువకుల మీద ఆంక్షలు, నిర్బంధాలు, నిషేధాలు, బారికేడ్లు, లాఠీ ఛార్జీలు, వాటర్ కానన్లు, పెల్లెట్ గన్‌లు, అమానుషమైన దాడులు, అటు కాక్రో జనతా పార్టీ, సోనం వాంగ్చుక్ నిరాహార దీక్షలు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మరి ముఖ్యంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యూహాత్మక పోరాట శైలి తో కేంద్ర ప్రభుత్వం దిగి రావడం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం గొప్ప ప్రజాస్వామ్య విజయం. దీని ద్వారా మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో 'జవాబుదారీతనం ఉంది, తప్పుకు పరిహారం ఉంది' అని చూపే ఒక చర్య అని అన్నారు. ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు యువకులు పౌర సమాజం అడిగే ప్రశ్నలకు మేము స్పందించం, మా ఇష్టారాజ్యంగా ప్రభుత్వాలను నడుపుతాం అనే బిజెపి పాలకులకు గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఉద్యమ స్వరూపాలు ఒక గుణపాఠమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలా వ్యవహరించడం రాచరికమో, నిరంకుశత్వమో, భూస్వామ్యమో అవుతుంది గాని దాన్ని ప్రజాస్వామ్యం అని, ప్రాతినిధ్య పాలన అని, ఆధునిక రాజనీతి అని అనడానికి ఎంతమాత్రమూ వీలులేదని విద్యార్థులు, యువకులు, పౌర సమాజం కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేసిందన్నారు. రాబోవు రోజుల్లో ఇలాంటి ఉద్యమాలతో పోరాటపటిమతో కేంద్రపాలకుల మెడలు వంచి రాజ్యాంగబద్ధంగా పాలన చేయాలని ఒక బలమైన సంకేతం ఈ ఉద్యమం ద్వారా హెచ్చరించడమైందన్నారు.

బద్వేల్‌లో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

ఆలయాల్లో భక్తుల కిటకిట
ప్రత్యేక పూజలు




(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 25) తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బద్వేల్ పట్టణంలోని పలు ఆధ్యాత్మిక క్షేత్రాలు భక్తిపారవశ్యంతో శోభిల్లాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర చన్నీటి స్నానాలు ఆచరించి, ఆలయాలకు తరలివచ్చి స్వామివారలకు కాయా కర్పూరం సమర్పించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధి లక్ష్మీ పాలెంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చాటకొండు సంజీవ్ కుమార్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చనలతో పాటు పలురకాల విశేష పూజలను వైభవంగా నిర్వహించారు. నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్, బద్వేల్ టిడిపి ఇంచార్జ్ మంచూరు సూర్యనారాయణరెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న నాయకులకు దేవాదాయ శాఖ ఈవో రామకృష్ణ, వేద పండితులు రమేష్ శర్మ, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపించి, శాలువాలు కప్పి, శ్రీవారి వస్త్రంతో ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు.

సుమిత్రానగర్‌లో భక్తుల సందడి :

ఎసిద్ధవటం రోడ్డులోని సుమిత్రానగర్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలోనూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, చక్రపాణి ప్రభాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు కేవీ సుబ్బారావు, కొప్పరపు శ్రీనివాసులు, కొండారెడ్డి, కనుమరుల పూటి మస్తాన్ రాజా, మెంటా వెంకట నాగేంద్ర, కుటుంబ సభ్యులతో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా
ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 25) పట్టణంలోని అమరావతి గ్రౌండ్స్ నందు కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్స్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స అందించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అని ముఖ్య ఉద్దేశంతో ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం బలపడుతుందనే భావనతో మహిళల ఆరోగ్యం కోసం ఎమ్మెల్యే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రజలకు నిపుణులైన వైద్యులు క్యాన్సర్‌కు సంబంధించిన ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవల పై సూచనలు అందించారు.




వైభవోపేతంగా చాగంరెడ్డి బ్రహ్మ కొండారెడ్డి,
లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం, అన్నదానం

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా
శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తజనం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 25) పొదిలి నగర పంచాయతీలోని లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నందు శనివారం తొలి ఏకాదశి పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామస్మరణతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పొదిలి అచ్చిరెడ్డి నగర్‌లోని చాగంరెడ్డి బ్రహ్మ కొండారెడ్డి , లక్ష్మి దంపతులు వారి తల్లిదండ్రులు చిన్న కొండారెడ్డి, ఓబులమ్మలకు పాద పూజ చేసి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విశ్వనాధపురం, పెద్ద బస్టాండ్ మీదుగా ఆలయం వద్దకు స్వామి వారికి సమర్పించే పట్టు వస్త్రాలను తలపై పెట్టుకుని సతీసమేతంగా కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి నిర్వహించిన ప్రత్యేక కళ్యాణ మహోత్సవాన్ని చాగంరెడ్డి బ్రహ్మ కొండారెడ్డి, లక్ష్మి దంపతులు కమనీయంగా వేదపండితులచే జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రావణి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, శనగపల్లి నాగేశ్వరరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణం పూర్తయిన అనంతరం మధ్యాహ్నం పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం చాగంరెడ్డి బ్రహ్మ కొండారెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ చాగంరెడ్డి బ్రహ్మ కొండారెడ్డి ఢిల్లీలో ఐఏఎస్ ఉద్యోగాలకు కోచింగ్ తీసుకునేందుకు వెళ్లిన ఈ ప్రాంత వాసులకు స్వంత నిధులు ఖర్చు చేసి వారికి అవసరమైన సేవలు అందించేవారని ఆయనను కొనియాడారు.











On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com